# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 20-01-2026** **సమయం : 6.45 గంటలు**

## ముఖ్యాంశాలు

1. తెలుగు వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.

2. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారు.

3. మైనారిటీల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

4. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఖనిజ నిల్వలు గుర్తించాలని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు.

తెలుగు వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. దావోస్ తొలి రోజు పర్యటనలో భాగంగా జ్యూరిచ్ లో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్ కు వచ్చాయని చెప్పారు. ప్రవాసాంధ్రులు పారిశ్రామిక వేత్తలుగా మారేలా ప్రభుత్వం సహకారం అందిస్తూ 50 కోట్ల రూపాయలతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్.. 25 సెకన్లు

-----------------------

దావోస్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండవ రోజు పలు సమావేశాల్లో పాల్గొంటారు. “భౌగోళిక ఆర్థిక వృద్ధిలో భారతదేశం – ఆంధ్రప్రదేశ్ కు ప్రయోజనం” పేరుతో సీఐఐ నిర్వహిస్తున్న సమావేశంలో ముఖ్యమంత్రి ఈ రోజు పాల్గొననున్నారు. తర్వాత భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండియా లాంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం పలు దిగ్గజ ఐటీ సంస్థల చైర్మన్ సీఈఓల సమావేశమవుతారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ లాంజ్‌లో నిర్వహించనున్న ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త అంశంపై నిర్వహించే చర్చకు హాజరవుతారు. అలాగే స్విట్జర్లాండ్ పార్లమెంటు సభ్యుడు, భారత- స్విస్ ఫ్రెండ్ షిప్ గ్రూప్ అధ్యక్షుడు నిక్ గుగ్గర్ సహా ఇతరులతో సమావేశం కానున్నారని అధికారులు తెలిపారు.

-----------------------

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ‘తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్-టీఏఐహెచ్’ను

దావోస్‌లోని మౌంటెన్ ప్లాజాలో ఈరోజు ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, టెక్నాలజీ రంగ ప్రముఖులు హాజరుకానున్నారు. ఏఐ పరిజ్ఞానాన్ని వినియోగించడం, ఏఐ ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ప్రత్యేకంగా రూపొందించిన 'టీఏఐహెచ్' తొలి 'ప్రపంచ ఏఐ ప్రయోగ వేదిక'గా పనిచేస్తుందని అధికారులు తెలిపారు.

-----------------------

మైనారిటీల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో కోటి 80 లక్షల రూపాయలతో క్రైస్తవ శ్మశాన వాటిక సుందరీకరణ, అభివృద్ధి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

-----------------------

ఆధునిక సాంకేతికతతో కూడిన సలహాలు అందించి రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆర్. శారద జయలక్ష్మిదేవి, శాస్త్రవేత్తలతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తెగుళ్లు లేదా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆయా ప్రాంతాలను సందర్శించి రైతులకు సలహాలు అందించాలని సూచించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలను ఉద్యానవన పంటల కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. రైతులకు పంట సాగు

ప్రతి దశలో శాస్త్రీయ సలహాలు అందిస్తే ఉత్పాదకత పెరిగి, నష్టాలు తగ్గుతాయని పేర్కొన్నారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఖనిజ నిల్వలు గుర్తించాలని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గనులశాఖ పరిధిలో మంత్రి అధ్యక్షతన ఖనిజాన్వేషణ ట్రస్ట్ -మెరిట్ పరిపాలక మండలి నిన్న సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త గనులు అందుబాటులోకి తెచ్చి, మైనింగ్ ప్రారంభిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఖనిజాన్వేషణతో పాటు, క్లిష్టమైన ఖనిజాలకు విలువ జోడింపుపై దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు.

-----------------------

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు క్యాంపు కార్యాలయంలో మంత్రి 35 మందికి వైద్య సహాయం కింద 22 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

-----------------------

గణతంత్ర దినోత్సవం సంధర్భంగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఏటా నిర్వహించే జాతీయ సర్వ భాషా కవి సమ్మేళనం నిన్న రాత్రి హైదరాబాద్ లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గీత

రచయిత సుద్దాల అశోక్ తేజ, ఆచార్య  వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ, బహు భాషలు, సంస్కృతి విరాజిల్లే దేశంలో 1956 నుంచి ఆకాశవాణి బహుభాషా కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తోందని ప్రశంసించారు.  ఈ పూర్తి కార్యక్రమాన్ని ఈ నెల 25 రాత్రి దేశంలోని అన్ని ఆకాశవాణి కేంద్రాలూ ప్రసారం చేస్తాయి.

-------------------

వందేమాతరం గేయం 150 ఏళ్ల ఉత్సవాల్లో భాగంగా  కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం -సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్-2026' రెండవ ఎడిషన్ నిర్వహిస్తున్నామని సీఐఎస్ఎఫ్ డీఐజీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. విశాఖ పట్నంలో ఆయన నిన్న పాత్రికేయులతో  మాట్లాడారు. 'సురక్షిత తీరాలు - సమృద్ధ భారతం నినాదంతో చేపడుతున్న ఈ సైక్లింగ్ యాత్ర  దేశవ్యాప్తంగా తొమ్మిది తీర ప్రాంత రాష్ట్రాల మీదుగా 6 వేల 500 కి.మీ. మేర సాగుతుందని చెప్పారు. ఈ యాత్ర ఫిబ్రవరి 4న సోంపేట వద్ద ఆంధ్రప్రదేశ్ లోకి ప్రవేశించి.. 6న విశాఖ చేరుకుంటుంది. 7న ఆర్కే బీచ్‌లో భారీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పోర్టుల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని డీఐజీ  వివరించారు.

---------------------

తెలంగాణాలోని ప్రతి ప్రభుత్వాస్పత్రిలో క్యాన్సర్ రోగుల కోసం కీమోథెరపీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. నాగర్‌కర్నూల్‌లో పర్యటించిన ఆయన  40 కోట్ల రూపాయాల విలువైన పలు అభివృద్ధి పనులకు నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతి నిరుపేద కుటుంబానికి నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.  రాష్ట్రంలో 109 ట్రామా కేర్ కేంద్రాలు  ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులు నైపుణ్యంతో

కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు.. రాష్ట్రంలో 105 సమీకృత పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది.

ఇక తెలుగు రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 5.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణాలో కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 7 కనిష్ట డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

= = = = = = = = = = = = = = =